క్లుప్తంగా

బాలయ్య మృతికి బూచేపల్లి నివాళి



బాలయ్య మృత దేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి

ముండ్లమూరు (తాళ్లూరు): బొద్దికూరపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ పెయిడ్ సెక్రటరీ ఇండ్ల బాలయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి మృత దేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. పులి ప్రసాదరెడ్డి, పులి రామిరెడ్డి, పులి అంజిరెడ్డి తదితరులున్నారు.

రోడ్డు విస్తరణ పనులకు భూమి పూజ నేడు

బేస్తవారిపేట: స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ నుంచి ఒంగోలు-నంద్యాల హైవేరోడ్డు వరకు రోడ్డు విస్తరణ పనులకు సోమవారం ఎమ్మెల్యే అన్నా రాంబాబు శంకుస్థాపన చేస్తామని సర్పంచ్ బుద్దుల ఆశ్రీతజ్యోతి తెలిపారు. ఎమ్మెల్యే నిధులు రూ.80 లక్షలతో రోడ్డు విస్తరణ, విద్యుత్ స్తంభాల మార్పు జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

సమస్యలు పరిష్కరించేందుకే జగనన్న సురక్ష



పథకం గురించి వివరిస్తున్న తహసీల్దార్

కొనకనమిట్ల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేస్తోందని తహసీల్దార్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం గొట్లగట్టు గ్రామంలో వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ ఉద్యోగులతో కలిసి ఇంటింటికీ వెళ్లి పథకాల అమలు, జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా అందిస్తున్న ఉచిత సేవలను వివరించారు. సర్వే పక్కాగా నిర్వహించి, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించాలని వలంటీర్లకు సూచించారు. ఆయన వెంట వీఆర్‌ఓ దిలీప్‌కుమార్, కార్యదర్శి ప్రసాద్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పెదవెంకటయ్య, సచివాలయ కన్వీనర్ ఏడుకొండలు ఉన్నారు.

నేడు జగనన్న సురక్ష

యర్రగొండపాలెం: జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలోని నరసాయపాలెం, గంగపాలెం సచివాలయాల పరిధిలో సోమవారం జరుగుతుందని తహసీల్దార్ కె.రవీంద్రరెడ్డి తెలిపారు. అర్జీలు పరిష్కరించుకోవాలని కోరారు.

ప్రత్యేక స్పందనను విజయవంతం చేయండి

దర్శి: నేడు దర్శిలో జరిగే ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ వెంకటేశ్వర్లు కోరారు. కలెక్టర్ దినేష్‌కుమార్, జిల్లా అధికారులు హాజరవుతారని చెప్పారు. జిల్లా స్థాయి స్పందన కార్యక్రమంలో ప్రజల సమస్యలు సై అర్జీలు స్వీకరించి పరిష్కారం చేస్తామని చెప్పారు. పట్టణంలోని శ్రీశ్రీనివాస పద్మావతి కళ్యాణ మండపంలో ఉదయం 10 గంటకు ప్రారంభం అయి 2 గంటల వరకు ప్రత్యేక స్పందన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం నుంచి నియోజకవర్గ అధికారులతో సమావేశం ఉంటుందని చెప్పారు.

ముండ్లమూరు ఎంఈఓగా సుబ్బారావు

ముండ్లమూరు: మండల ఒకటో ఎంఈఓగా జలపాటి సుబ్బారావుని నియమిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి రమేష్ నుంచి నియామక ఉత్తర్వులు తీసుకున్నట్లు సుబ్బారావు తెలిపారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జ్ ఎంఈఓగా పని చేసిన చంద్రమోహన్ దర్శి మండలం రాజంపల్లికి హెచ్‌ఎంగా వెళ్లారు. ఆయన స్థానంలో గుంటూరు జిల్లా చేబ్రోలులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తున్న సుబ్బారావు బదిలీపై ఎంఈఓగా నియమితులయ్యారు.



భక్తి శ్రద్ధలతో అంకాలమ్మ పొంగళ్లు



కొనకనమిట్ల: ఆలయం వద్ద నైవేద్యాలతో భక్తులు



కొనకనమిట్ల: బారులు తీరిన కుంకుమ బండ్లు



అంకాలమ్మ తల్లి

కొనకనమిట్ల: మండలంలోని గార్లదిన్నె గ్రామంలో ఆదివారం గ్రామ దేవత అంకాలమ్మతల్లికి గ్రామస్తులు ఉత్సవం నిర్వహించి పొంగళ్లు పెట్టారు. అమ్మా అంకాలమ్మా దీవించమ్మా అంటూ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకొని పునీతులయ్యారు. అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్‌లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా కుంకుమ బండ్లు కట్టి ఉత్సవంగా అమ్మవారి ఆలయం వద్దకు చేరి మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా ఉత్సవం నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో నైవేద్యాలు సమర్పించి సకాలంలో వర్షాలు పడి గ్రామం పాడి పంటలతో పచ్చగా ఉండాలని కోరుతూ అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఉత్సవం సందర్భంగా అంకాలమ్మతల్లి ఆలయాన్ని రంగు రంగుల దీపాలతో అలంకరించారు.

పోలేరమ్మ తల్లికి పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. పోలేరమ్మ తల్లి భక్తులను చల్లంగా చూడాలని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మ భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందింది. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

కోటా సత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్ర నామ పూజలు, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు. అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్

దర్శి: ప్రజా సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ పేర్కొన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా హ్యాపీ హోమ్స్‌లో ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హాజరైన ఎమ్మెల్యేకు దుశ్శాలువాలు, పూల మాలలతో ఘన సత్కారం చేశారు. ఆప్రాంతంలో విద్యుత్ స్తంభాలు, వీధి లైట్లు వంటి పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టి తీసుకువచ్చారు. సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ పార్టీలకతీతంగా పథకాలు అందించడమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశ్యం అన్నారు. మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, ఎంపీపీ సుధా అచ్చయ్య, రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, గోను నారాయణరెడ్డి, తెలగంశెట్టి చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వేమిరెడ్డి చెన్నారెడ్డి, కౌన్సిలర్లు వీసీరెడ్డి, తాళ్లూరి బాబురావు, మోహన్‌బాబు, నాయకులు రవి, జగన్, యర్రయ్య, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి మహోత్సవాలు



కొమరోలు: హోమంలో పాల్గొన్న భక్తులు

కొమరోలు: గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక రాజుగారికోటలో వెలసిన షిరిడీ సాయిబాబా దేవస్థానంలో 2వ రోజు ఆదివారం గురుపౌర్ణమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజాము నుంచి నగర సంకీర్తనతో మొదలు సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలు నిర్వహించారు. గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు కామూరి రమణరెడ్డి సతీసమేతంగా చండీ యాగంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

బేస్తవారిపేట: మండలంలోని దరగాకొండపై త్రిలోక పుణ్యక్షేత్రంలోని షిరిడిసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కర్నాటి గిరీష్‌రెడ్డి తెలిపారు. పంచామృత అభిషేకాలు, షోడపోచార పూజ, అష్టోత్తర శతనామావలి పూజ, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరుగుతుందన్నారు. సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గ్రామోత్సవం జరుగుతుందని తెలిపారు.

తర్లుపాడు: గురుపౌర్ణమి మహోత్సవాల సందర్భంగా తర్లుపాడులోని శ్రీషిరిడీ సాయి మందిరంలో నేడు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ నాగమల్లికార్జున తెలిపారు. అభిషేకం, అలంకరణ, గోత్రనామాలతో పూజలు, మధ్యాహ్నం సాయి హారతితోపాటు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం హారతి, పల్లకి ఉత్సవం నిర్వహిస్తున్నట్లు వివరించారు.

పెద్దారవీడు: మండలంలో చట్లమిట్లలో గురుపౌర్ణమి సందర్భంగా షిరిడీ సాయిబాబా మందిరంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఉదయం అభిషేకాలు, హారతి, తదితర పూజలు ఉంటాయని, మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం కోలాటం, గ్రామంలో రథోత్సవం, రాత్రి శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జీవిత చరిత్ర నాటకం ప్రదర్శిస్తారన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని 4వ వార్డులో తూర్పువీధిలోని జువ్విచెట్టు వద్ద నుంచి సోమవారం సాయంత్రం 4 గంటలకు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కౌన్సిలర్ డాక్టర్ చెప్పల్లి కనకదుర్గ తెలిపారు. అధికారులు, కౌన్సిలర్లు, గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, జగనన్న అభిమానులు హాజరుకావాలని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు.

ఆక్రమణల తొలగింపు



గిద్దలూరు రూరల్: గుంటూరు గుంతకల్ మధ్యలో గల రైల్వే డబుల్ లైన్ పనుల్లో భాగంగా పట్టణంలోని పాములపల్లె రైల్వే గేటు రాచర్ల రైల్వే గేటు మధ్యలో ఉన్న ఆక్రమణలను రెవెన్యూ, రైల్వే అధికారులు ఆదివారం తొలగింపు చర్యలు చేపట్టారు. గిద్దలూరు రెవెన్యూ పరిధిలోని హిల్ 10 కొండపోరంబోకు స్థలంలో నివాసం ఉంటున్న గృహాలు రైల్వే డబుల్ లైన్‌కు అడ్డు రావడంతో వాటిని తొలగించి పరిహారం చెల్లించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

సోషల్ మీడియా యాప్‌ను ఆవిష్కరించిన మంత్రి కారుమూరి



యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కారుమూరి

మార్కాపురం: మార్కాపురం పట్టణానికి చెందిన మీసాల శ్రీకర్ యాదవ్ రూపొందించిన ఇండియన్ సోషల్ మీడియా యాప్‌ను ఆదివారం తాడేపల్లిలో పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విభిన్నమైన నూతన ఆవిష్కరణలు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంతో పాటు రాష్ట్రానికి మంచి పేరు తేవాలని సూచించారు. శ్రీకర్ మాట్లాడుతూ.. యాప్‌ను ప్రపంచంలోని అన్ని దేశాల్లో ఉపయోగించుకోవచ్చని, హై సెక్యూరిటీ యాక్టివిటీస్ ఉంటాయని, యాప్ ద్వారా సర్వేలు నిర్వహించుకోవచ్చని, స్పామ్ కాల్స్ ఉండవని తెలిపారు. అనంతరం మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎల్పీ యాదవ్, మీసాల గంగయ్య, బి.రమేష్, పిన్నిక చక్రపాణి, న్యాయవాది నాగార్జున యాదవ్, రాష్ట్ర యాదవ మహా సంఘం పీఏసీ చైర్మన్ జి.శ్రీనివాసరావు, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కోశాధికారి రామవరప్పాడు సర్పంచ్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నిఘా నేత్రాలు పటిష్టం



పోలీసు స్టేషన్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ

గిద్దలూరు రూరల్: పోలీసుల ఆధ్వర్యంలో నిఘా నేత్రాలు మరింత పటిష్టం చేస్తున్నామని మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేరాలను అరికట్టేందుకు పోలీసు శాఖ వారికి ప్రజలు సహకరించాలని కోరారు. లాడ్జింగ్‌లు, రెస్టారెంట్‌లు, సినిమా థియేటర్‌లు, ఊరి చివరగా ఉండే నివాస గృహాల యజమానులతో పాటు ప్రతి ఒక్క వ్యాపార సముదాయం వద్ద సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. పోలీసు సిబ్బంది ప్రజలకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నారన్నారు. సీఐ పి.దేవప్రభాకర్, ఎస్సై మహేష్ ఉన్నారు.

గ్రంథాలయ భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎస్సై మల్లికార్జున

పొదిలి: పట్టణంలోని ఏబీఎం పాఠశాల వద్ద దళిత నాయకుడు పులుకూరి అనిల్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గ్రంథాలయానికి ఆదివారం ఎస్సై మల్లికార్జున శంకుస్థాపన చేశారు. మహనీయుడు అంబేడ్కర్ పేరున గ్రంథాలయం నిర్మించాలన్న తన సూచనను అమలుపరుస్తున్న అనిల్‌ను ఎస్సై అభినందించారు. ముందుగా అంబేడ్కర్, జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు ధర్నాసి పెద్దన్న, బాప్టిస్ట్‌పాలెం సురేష్, ఆదిమూలపు రవి, నాగులు, మోషె, వేల్పుల ప్రవీణ్, బందారు అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మస్టర్స్ నమోదులో జాగ్రత్త



విచారణ చేస్తున్న పీడీ సీనారెడ్డి

దొనకొండ: గ్రామాల్లో ఉపాధి పనులు చేయిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు మస్టర్స్ నమోదులో జాగ్రత్తగా ఉండాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ డ్వామా పీడీ సీనారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక ఉపాధి కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన పాల్గొని విచారణ చేపట్టారు. మండలంలో 18 పంచాయతీల్లో 40 హ్యాబిటేషన్లలో జరిగిన పనులను వీఎస్‌ఏలు చదివి వినిపించారు. 1 ఏప్రిల్ 2022 నుంచి 30 మార్చి 23 వరకు జరిగిన సుమారు రూ. 10 కోట్లు పనులకు సంబంధించి పూర్తి స్థాయిలో విచారించారు. అనంతరం పీడీ సీనారెడ్డి విలేఖరులతో మాట్లాడుతూ మస్టర్ నమోదులో చిన్న చిన్న పొరపాట్లు జరిగాయని వివరించారు. 5 నుంచి 7 శాతం తప్పులు తప్పా ఎలాంటి సంఘటనలు లేకుండా ప్రజా వేదిక ప్రశాంతంగా జరిగింది. మస్టర్స్ నమోదులో తప్పులు ఉన్న వారిపై రికవరీ చేస్తామని వెల్లడించారు. రాబోయే సంవత్సరం ప్రజా వేదికలో ఎలాంటి తప్పులు లేకుండా ఉపాధి సిబ్బంది జాగ్రత్తగా ఉండాలని సీనారెడ్డి తెలిపారు. ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, వైస్ ఎంపీపీ మిట్టా కోటిరెడ్డి, ఎంపీడీఓ వి.వసంతరావు నాయక్, విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి, అంబుడ్స్‌మెన్ శ్రీకాంత్‌రెడ్డి, ఏపీఓ దేవయ్య, ఎస్ఆర్పీ సుమన్, ఈసీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోశయ్య విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే అన్నా



రోశయ్య విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే అన్నా

గిద్దలూరు రూరల్: విజయవాడ మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఆర్యవైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అన్నా రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోశయ్య రాష్ట్రానికి చేసిన సేవలను ఆయన కొనియాడారు.

రిటైర్డ్ హవల్దార్‌కు ఘన స్వాగతం



భాస్కరరావుకు స్వాగతం పలుకుతున్న నాయకులు

తర్లుపాడు: మండలంలోని కారుమానిపల్లి గ్రామానికి చెందిన మంచా భాస్కరరావు గత 25 సంవత్సరాలుగా ఆర్మీలో హవల్దార్‌గా విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందారు. ఆదివారం స్వగ్రామానికి చేరుకున్న సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, కుటుంబ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి సత్కరించారు. విద్యార్థులు దేశభక్తి గీతాలకు నృత్యం చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మురారి వెంకటేశ్వర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

గాండ్ల, తెలికుల విద్యార్థులకు అండగా ఉంటాం



సర్వసభ్య సమావేశం ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

పొదిలి: గాండ్ల సామాజిక వర్గంలోని విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకునేందుకు అండగా ఉంటామని రాష్ట్ర గాండ్ల, తెలికుల ఉద్యోగ సంఘ ఉపాధ్యక్షుడు దాసరి గురుస్వామి పేర్కొన్నారు. స్థానిక శ్రీసాయి పబ్లిక్ స్కూల్లో ఆదివారం సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడు చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్పొరేషన్‌కు ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. ఇంటర్మీడియెట్‌లో అధిక మార్కులు పొందిన విద్యార్థులను సత్కరించి అభినందించారు. జూలై 9వ తేదీన ఒంగోలులో నిర్వహించనున్న జిల్లా సర్వసభ్య సమావేశం ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యాయవాది దుడ్డు హరిప్రసాద్, కోశాధికారి వెంకట రామయ్య, ఉపాధ్యక్షులు వరికుంట్ల వెంకటేశ్వర్లు, హరిబాబు, సత్యనారాయణ, రామారావు, దుడ్డు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల మంజూరు

కురిచేడు: మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కోరటంతో మంజూరు చేసినట్లు జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి ఆదివారం తెలిపారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్, దర్శి మాజీ శాసన సభ్యులు డా. బూచేపల్లి శివప్రసాదరెడ్డి సహకారంతో జూనియర్ కళాశాల మంజూరు చేయించినట్లు తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరానికి కళాశాల ప్రారంభం అయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు.

కంది రైతులకు రూ.11.48 కోట్ల బీమా

మార్కాపురం: డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద గతేడాది ఖరీఫ్ పంటల కాలానికి దిగుబడి ఆధారిత బీమా పథకం కింద 5,313 మంది కంది రైతులకు రూ.11.48 కోట్లు, వాతావరణ ఆధారిత బీమా పథకం కింద 3,454 మంది రైతులకు రూ.2.32 కోట్ల పరిహారం మంజూరైనట్లు వ్యవసాయాధికారి దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. బీమా పరిహారం లబ్ధిదారుల జాబితాను రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ నిమిత్తం ఈనెల 3వ తేదీ వరకు ప్రదర్శిస్తున్నామని, అభ్యంతరాలున్నవారు 4వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా తెలియజేయాలని స్పష్టం చేశారు. వాతావరణ ఆధారిత పంట నష్టం అంచనా కోసం మార్కాపురం సబ్ డివిజన్ పరిధిలోని 25 ఏడబ్ల్యుఎస్ వాతావరణ కేంద్రాల్లో నమోదైన సమచారాన్ని పరిగణలోకి తీసుకుని నోటిఫికేషన్‌లోని నిబంధనల ప్రకారం లెక్కించి, వీటి ఆధారంగా బీమా పరిహారాన్ని అర్హులైన రైతులకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

1009 మంది రైతులకు నష్టపరిహారం

పెద్దారవీడు: మండల పరిధిలో 2021–22 ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంట దెబ్బతిన్న 1009 మంది రైతులకు 1303.11 ఎకరాలకు గానూ రూ. 1,53,58,251 కోట్లు వైఎస్సార్ పంటల బీమా ద్వారా విడుదలైనట్లు వ్యవసాయాధికారి కె. బుజ్జిబాయి ఆదివారం తెలిపారు. రైతుల బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. లబ్ధిదారుల జాబితాలను ఆయా ఆర్బీకేల నోటీసు బోర్డులో ప్రదర్శించామని, రైతులు జాబితాలను పరిశీలించుకోవాలని తెలిపారు.

2836 మందికి పంటల బీమా

దర్శి: మండలంలోని 2836 మంది కంది పంట వేసిన రైతులకు రూ.34084768 పంటల బీమా వస్తుందని ఏఓ బాలకృష్ణ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరం కంది పంట సరిగా పండక రైతులు నష్ట పోయారన్నారు. దీంతో కందికి బీమా వర్తించి ఇస్తున్నట్లు తెలిపారు.

సాయిబాబాకు వెండి గొడుగు బహూకరణ



వెండి గొడుగును బహూకరిస్తున్న వెంకటనారాయణ

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో ఉన్న షిరిడీ సాయిబాబా ఆలయానికి ఆదివారం యక్కలి వెంకటనారాయణ అనే భక్తుడు రూ.5 లక్షల విలువైన వెండి గొడుగు అందజేశారు. గురుపౌర్ణమి సందర్భంగా బాబా విగ్రహానికి వెండి గొడుగును అలంకరించాలని మందిర అధ్యక్ష కార్యదర్శులు పేరం సత్యనారాయణ, గోపాలుని హరిహరరావుకు కోరారు. కాగా సోమవారం గురుపౌర్ణమి వేడుకను ఘనంగా నిర్వహిస్తున్నట్లు మందిర నిర్వాహకులు తెలిపారు. బాబాకు ప్రత్యేక పూజలు చేయడంతోపాటు వేలాది మంది భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గోపాలుని కృష్ణమోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

